క్లుప్తంగా

ఒత్తిడికి దూరంగా ఉండాలి

● మానసిక వైద్యురాలు తేజస్విని



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక తేజస్విని

విజయనగరం ఫోర్ట్: ఒత్తిడికి దూరంగా ఉండడం వల్ల మానసిక సమస్యలకు గురికాకుండా ఉండవచ్చని మానసిక వైద్యురాలు మౌనిక తేజస్విని అన్నారు. శనివారం స్థానిక మహాత్మా గాంధీ వృద్ధాశ్రమంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. మతిమరుపు, తనలో తాను మాట్లాడుకోవడం, ఆకలి లేకపోవడం, సరిగా నిద్ర పట్టకపోవడం, నిరాశ, తదితర లక్షణాలు మానసిక సమస్యలకు కారణమన్నారు. ఎక్కువగా వృద్ధులకు మానసిక సమస్యలు వస్తాయని తెలిపారు. వీలైనంతవరకు ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఉండడంతో పాటు వృద్ధులను ప్రేమగా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజు, సంతోష్, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రమాణ స్వీకారం చేస్తున్న సర్పంచ్ సత్తిబాబు

పూసపాటిరేగ: మండలంలోని కొప్పెర్ల పంచాయతీ సర్పంచ్‌గా ఇటీవల ఎన్నికైన శంకాబత్తుల సత్తిబాబు శనివారం స్థానిక సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. సత్తిబాబుతో కార్యదర్శి ఉమాశంకరి ప్రమాణపత్రం చదివించారు. అనంతరం పలువురు పుష్పగుచ్ఛాలు ఇచ్చి సర్పంచ్‌ను అభినందించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు..



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: యువత మాదకద్రవ్యాల జోలికిపోవద్దని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు సూచించారు. శనివారం స్థానిక ఎస్‌ఆర్‌ఐ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బంగారు భవిష్యత్‌ను నాశనం చేసే మత్తు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన వ్యక్తులు వాటి నుంచి బయటపడలేక, విచక్షణ కోల్పోయి, నేరాలకు పాల్పడుతూ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై భాస్కరరావు, ఎస్‌ఆర్‌ఐ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని వివిధ పుష్పాలు, తులసీ దళాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఏ.ఆర్.పేట గ్రామంలో పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రూ.50.73 లక్షలతో ఇంటింట కుళాయిలు



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యుడు విశ్వేశ్వరరావు

మెరకముడిదాం: మండలంలోని చిన బంటుపల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.50.73 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పార్వతి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం భూమిపూజ చేశారు. మాజీ జెడ్పీటీసీ కోట్ల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కోట్ల మోతీలాల్‌నాయుడు, ఎంపీటీసీ పల్లి కృష్ణంనాయుడు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సమృద్ధిగా రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇంటింట కుళాయిలను ఏర్పాటు చేస్తోందన్నారు.

భూమికి పచ్చని రంగేసినట్టు...



ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతానికి నాట్లు పూర్తవడంతో ఎక్కడ చూసినా పచ్చని వాతావరణం కనిపిస్తోంది. విజయనగరం సమీపంలోని గుంకలాంలో పొలాలు భూమికి పచ్చని రంగేసినట్లు కనిపిస్తున్నాయి.
– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

అంబళ్లకు శుభాకాంక్షలు



అంబళ్లకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఒమ్మి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అంబళ్ల శ్రీరాములనాయుడుకు మండలానికి చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గేదెల రామ చిరంజీవి, రేవళ్ల శ్రీనివాసరావు, అంబళ్ల కిరణ్, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సత్యనారాయణ, బొంతు పురుషోత్తమరావు, నాయకులు మత్స శ్రీను, తర్లాడ దుర్గారావు, కంచరాపు రాము, రాంబార్కి రామారావు, గవిడి వెంకటరావు, కంది శ్రీనివాసరావు, మిరప నారాయణ, గురునాథరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి చండీయాగం



అమ్మవారి చండీయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారి వనంగుడిలో చండీయాగం శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు సాయి, వెలువలపల్లి నరసింహమూర్తి శాస్త్రోక్తంగా యాగప్రక్రియను చేపట్టారు. అనంతరం యాగ విశిష్టతను భక్తులకు వివరించారు. అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను యాగంలో పాల్గొన్న భక్తులకు అందజేశారు. కార్యక్రమాలను ఆలయ ఈఓ కేఎల్. సుధారాణి పర్యవేక్షించారు.

పేదలను ఆదుకోవడం అందరి బాధ్యత

● జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌కౌశిక్



నిరుపేదలకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: పేదలను ఆదుకోవడం అందరి బాధ్యతని.. పలు సంస్థలు సామాజిక బాధ్యతగా పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేయడం అభినందనీయమని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు జి.ఈశ్వర కౌశిక్ అన్నారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద జేసీఐ విశాఖ జోన్, నెస్టలీ సౌజన్యంతో రింగురోడ్డులో 450 మంది పేదలకు శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సంస్థ ప్రతినిధులు ప్రతి ఏటా సీఎస్‌ఆర్ యాక్టివిటీ కింద సుమారు రూ. 1.50 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారని చెప్పారు.

విజయనగరం ప్రజల పట్ల ఇటువంటి ఆదరాభిమానాలు చూపుతున్న సంస్థలకు కృతజ్ఞతలు తెలియజేశారు. జేసీఐ విశాఖ జోన్ ప్రెసిడెంట్ అమరేష్ మాట్లాడుతూ, సుమారు 450 మందికి ఒక్కొక్కరికీ రూ.1,200 విలువ గల నిత్యావసర సరకుల కిట్లు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జేసీఐ, నెస్టలీ సంస్థల ప్రతినిధులు హర్షవర్ధన్, మతివన్నన్, శ్రావణ్‌కుమార్ సింగ్, రామ సూర్యన్, వైఎస్సార్‌సీపీ నాయకులు కృష్ణారెడ్డి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు



ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

బొండపల్లి: మండలంలోని నెలివాడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) బి.లింగేశ్వరరెడ్డి శనివారం తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను వినియోగిస్తున్నదీ లేనిదీ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఉపాధ్యాయులకు డీఈఓ పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

అర్చకుల క్వార్టర్స్ ప్రారంభం



క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, దేవదాయశాఖ అధికారులు

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో నిర్మించిన అర్చకుల క్వార్టర్స్‌ను ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ, పర్యవేక్షకురాలు పి.వి.లక్ష్మి శనివారం ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ,ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో మంజూరైన సీజీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో క్వార్టర్స్ నిర్మించామని చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఆలయ కార్య నిర్వహణాధి కారి జి.శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ సూరు వెంకటకుమారస్వామి, నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ

కొత్తవలస: సర్వేంద్రియానం నయనం ప్రధానమని, మరణానంతరం నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు అంధులకు కంటి చూపు ప్రసాదించిన వారవుతారని వియ్యంపేట పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ సీహెచ్.ఈశ్వరరావు అన్నారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో స్థానిక బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ నేతృత్వంతో నేత్రదానంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు.

సేవ, ప్రేమలకు ప్రతిరూపం మదర్ థెరీసా



విజయనగరం: పుస్తకాలు, పెన్నులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు



పూసపాటిరేగ: విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వినోద్

● వాడవాడలా విశ్వమూర్తి జయంతి

విజయనగరం: ప్రేమ, సేవలకు ప్రతిరూపమైన విశ్వమాత మదర్ థెరీసా ప్రపంచానికి ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. మదర్ థెరిసా 113వ జయంతిని శనివారం వాడవాడలా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని అయ్యన్నపేట జంక్షన్‌లో థెరిసా కిడ్స్ స్కూల్‌లో 50 మంది చిన్నారులకు మదర్ థెరిసా సేవా సంఘం అండ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ సభ్యులు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం పత్రికారంగంలో విశిష్ట సేవలందిస్తున్న పలువురిని సత్కరించారు. కార్యక్రమంలో సేవా సంఘ అధ్యక్షుడు త్యాడ ప్రసాద్‌పట్నాయక్, గౌరవ అధ్యక్షుడు త్యాడ వేణుగోపాలం, సభ్యులు నూతన్, శ్రీనివాస్, శ్రావణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సాయి కృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

విశ్వమాత మదర్ థెరిసా జయంతి సందర్భంగా శ్రీసాయికృష్ణా వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కోట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న వాకర్స్ నడక మైదానంలో మదర్ థరీసా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు మాష్టారు మాట్లాడుతూ, విశ్వం ఉన్నంతవరకు మానవతావాదులు అందరూ పూజించే దేవత మదర్ థెరీసా అని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి జి. గోవిందరావు, క్లబ్ గౌరవ సలహాదారుడు ఎ.తిరుపతిరావు, వాకర్స్ క్లబ్ పెద్దలు పైడయ్య, వల్లూరి శ్రీనివాసరావు, తాడ్డి ఆదినారాయణ, ఆర్‌సీహెచ్ అప్పలనాయుడు, కోట్ల ఈశ్వరరావు, ఐవీ ప్రసాదరావు, జనార్దన్ మాష్టారు, తదితరులు పాల్గొన్నారు.

ఓక్‌ల్యాండ్ పాఠశాలలో...

పూసపాటిరేగ: మండల కేంద్రంలోని ఓక్‌ల్యాండ్ పాఠశాలలో మదర్‌థెరీసా జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుమారు 600 మంది విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్. రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌కు మరమ్మతులు

● కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



పాత ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ శ్లాబ్‌ను పరిశీలిస్తున్న కమీషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాత ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్‌కు పాక్షిక మరమ్మతులు చేపట్టి ప్రజా వినియోగంలోకి తీసుకురానున్నట్లు కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు తెలిపారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ పరిసరాలను శనివారం ఆయన పరిశీలించారు. ఇటీవల కాంప్లెక్స్ దక్షిణ భాగంలో చిన్నపాటి గోడ కూలడంతో వ్యాపారస్తుల అభ్యర్థన మేరకు మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్, ఇతర అధికారులతో కలిసి కమిషనర్ కాంప్లెక్స్‌ను పరిశీలించి, శ్లాబు పనులు పూర్తి స్థాయిలో చేపట్టేందుకు నిర్ణయించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ, నగర నడిబొడ్డులో గల పాత ఐడీఎస్ఎంటీ షాపింగ్ కాంప్లెక్స్ వల్ల ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. రెవెన్యూ, హెల్త్ కమిటీ సభ్యులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసి కాంప్లెక్స్ అభివృద్ధిలో భాగంగా భవిష్యత్ కార్యాచరణపై సమాలోచనలు జరిపే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమన్వయ కమిటీ నిర్ణయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకురానున్నట్లు చెప్పారు. పరిశీలనలో అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఈఈ కె.శ్రీనివాసరావు, డీఈలు, తదితరులు పాల్గొన్నారు

ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడాలి



శిక్షణ పూర్తి చేసుకున్న ఈఎంటీలతో నజీర్ హుస్సేన్

● 108 అరబిందో ఎమర్జెన్సీ సంస్థ మేనేజర్ నజీర్ హుస్సేన్

విజయనగరం ఫోర్ట్: ఆపదలో ఉన్న రోగులను సకాలంలో ఆస్పత్రిలో చేర్పించి వారి ప్రాణాలు కాపాడాలని 108 అరబిందో ఎమర్జెన్సీ సంస్థ మేనేజర్ నజీర్ హుస్సేన్ అన్నారు. శనివారం స్థానిక 108 సంస్థ కార్యాలయంలో విజయనగరం, చీపురపల్లి , బొబ్బిలి డివిజన్‌లకు చెందిన ఈఎంటీలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబులెన్స్‌లో రోగిని ఎక్కించిన వెంటనే వ్యాధి తీవ్రతను తగ్గించడానికి చికిత్స అందించడం ద్వారా ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చన్నారు. రోగిని తరలించడంలో అలసత్వం వహించకూడదని సూచించారు. కార్యక్రమంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లు అవనాపు సాయిషణ్ముఖ, ఎ. శ్రీనివాసరావు, రవి, తదితరులు పాల్గొన్నారు.

అలక్‌నారాయణ్ గజపతిరాజ్‌కు నివాళులు



ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

డెంకాడ: మహరాజ్ అలక్‌నారాయణ్ గజపతిరాజు 121వ జయంతిని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎంవీజీఆర్ డైరెక్టర్ పీఎస్ సీతారామరాజు, ప్రిన్సిపాల్ ఆర్.రమేష్, వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్స్, హెచ్‌ఓడీలు, తదితరులు కళాశాలలో ఉన్న అలక్‌నారాయణ్ గజపతిరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాల ఆవరణంలో ఎంవీజీఆర్ ఎన్ఎస్ఎస్ యూనిట్, విజయనగరం న్యూలైఫ్ బ్లడ్ సెంటర్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదానం శిబిరంలో 60 యూనిట్ల రక్తం సేకరించారు. కార్యక్రమంలో స్టూడెంట్ డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.షణ్ముఖరావు, అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాలు



నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు

● హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: జగనన్న ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ వి. శ్రీనివాసరావు సూచించారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట జగనన్న కాలనీలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలో 30 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, మరో 10 ఇళ్లకు శ్లాబులు వేశారని, 70 ఇళ్లు పునాదుల స్థాయిలో ఉన్నాయని పీడీకి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇళ్ల నిర్మాణాలను ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని, లబ్ధిదారులకు ఇబ్బందుల్లేకుండా నిర్మాణాలు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు మౌలిక వసతుల సమస్యను పీడీ దృష్టికి తీసుకువెళ్లగా.. పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ మురళీమోహన్, మేనేజర్ విశ్వేశ్వరరావు, ఏఈ పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.